జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 12-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 366 పేజీలు: 4 వెల : రూ.7





# రెవెన్యూ.. లీలలు!



* మండల తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రతి పనికో రేటు
* కొందరు వీఆర్వోల నుంచి మండల అధికారి వరకూ కాసులు ఇవ్వాల్సిందే
* లేకుంటే పనులు ముందుకుసాగవు
* కరెక్షన్ కావాలంటే.. కలెక్షన్ ఇవ్వాల్సిందే
* పట్టా మార్పిడికి.. పైసా వసూల్
* పాస్‌బుక్‌కు మరో రేటు
* తహశీల్దార్ కార్యాలయాల్లో జోరుగా అక్రమాలు
* కొత్తూరు తహశీల్దార్ కార్యాలయ ఘటనతో ప్రకంపనలు
* రెవెన్యూ యంత్రాంగంలో అలజడి

**శ్రీకాకుళం, జూన్ 11 (వార్త):** ప్రజలకు మేలు చేయాల్సిన రెవెన్యూ శాఖలో కొందరు మండల అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలు ఆశాఖకే మచ్చ తెస్తోంది. ఆయా కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు సేవలందించడం మరచిపోయి కలెక్షన్‌పైనే పడ్డారు. రెవెన్యూకు సంబంధించి ఏ పని కావాలంటే క్షణాల్లో చేసిపెడుతున్నారు.. అయితే దానికో రేటు ఇవ్వాలిమరి. మ్యుటేషన్ చేయాలన్నా, పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలన్నా, డీ పట్టాను జిరాయితీగా మార్చాలన్నా.. ఇలా అనేక రెవెన్యూపరమైన సేవలను కాసులు తీసుకుని చకచకా చేసేస్తున్నారు. డబ్బున్న మారాజులు, కొందరు రియల్టర్లు కార్యాలయానికి రాకుండానే తమ పని కానిచ్చేస్తున్నారు. పేద రాజులు మాత్రం డబ్బులు ఇచ్చుకోలేక గ్రీవెన్స్‌లో వినతులు ఇస్తూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే ఈ వ్యవహారమంతా గుట్టుచప్పుడుగానే చేస్తుంటారు. ఎంతోకొంత ఇచ్చేస్తే సరిపోతుందని.. తమ పని అయిపోతే చాలనుకుని రెవెన్యూ సిబ్బంది అడిగినంత ఇచ్చేసుకుంటున్నారు. జడ్పీలో నిర్వహించే మీకోసంలో కూడా ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలపైనే ఎక్కువగా అర్జీలు వస్తున్నాయి. భూములకు సంబంధించిన సర్వే కూడా అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. మండల, సచివాలయ సర్వే అధికారులు, సిబ్బంది సైతం ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. ఎప్పుడు కూడా వారు కార్యాలయాలకు సమయానికి రారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఫీల్డ్, రీసర్వే చేస్తున్నామంటూ చెబుతుంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓ ఎనిమిది అధికారులు, సిబ్బంది అక్రమాలు, అవినీతి చిట్టా బయటకు రావడంతో రెవెన్యూశాఖలో ప్రకంపనలు సృష్టించాయి. ఏకంగా ఏసీబీ అధికారులే వారి పేర్లను విడుదల చేశారు. 'జాతీయ వార్త'లో వచ్చిన కథనంపై చర్చ సాగింది. జిల్లాలో సమర్ధవంతంగా పనిచేస్తున్న కలెక్టర్.. రెవెన్యూ కార్యాలయాలను సందర్శిస్తే నిజాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.


అవినీతికి అడ్డా..
కొత్తూరు తహశీల్దార్ కార్యాలయం
ఫిర్యాదులు రెవెన్యూపరమైన అంశాలపైనే
ఎనిమిది మంది ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు..
ప్రభుత్వం కఠిన వ్యాఖ్యలు..

## భర్త ఇంటి ముందు..
# న్యాయపోరాటం



* విడాకులు ఇవ్వకుండా మరో పెళ్లి చేస్తున్న భర్త
* న్యాయం చేయాలంటున్న భార్య

4లో

## ఉపాధి బకాయిలు
# చెల్లించండి



* వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన రామ్మోహన్

4లో

## పోరాటాలతో సాధించుకున్న
# హక్కులు కాపాడుకోవాలి



* దేశ సంపదంతా కార్పొరేటర్ల చేతుల్లోనే
* సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

4లో

## రెడ్డీస్ లేబరేటరీస్
# ఉద్యోగులే.. ఇంటిదొంగలు

* 2 కోట్లు విలువైన 450 గ్రాముల సెమాగ్లుటైడ్ కేసును ఛేదించిన జేఆర్‌పురం పోలీసులు
* 8మంది ముద్దాయిలు అరెస్ట్
* వారిలో నలుగురు డా.రెడ్డీస్ లేబరేటరీస్ ఉద్యోగులే
* సెమాగ్లుటైడ్ ప్రొడక్ట్ పూర్తి స్థాయిలో రికవరీ
* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జూన్ 11 (వార్త):** పైడిభీమవరం ఇండస్ట్రీస్ బెల్ట్ ఉన్న డాక్టర్ రెడ్డిస్ లేబరేటరీస్‌లో ఒక ఫార్మా ప్రోడక్ట్‌ను గత మార్చి నెలలో చోరీ అయినట్టు ఫిర్యాదు వచ్చిందని, దర్యాప్తులో భాగంగా ఎనిమిది మందిని అరెస్టు చేశామని, వారిలో నలుగురు లేబరేటరీస్‌లో పనిచేసేవారు ఉన్నారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. దొంగలించబడిన సెమాగ్లుటైడ్ అనే ఫార్మా ప్రోడక్ట్‌ను డయాబెటిస్ చికిత్సకు, దీర్ఘకాలిక బరువు నియంత్రణకు ఉపయోగించే ఓ ఔషధమన్నారు. ఈ ప్రొడక్షన్ అనేది ఇతర దేశాలకు ఉత్పత్తి చేయబడిన పూర్తి పేటెంట్ ఔషధమని చెప్పారు. దొంగలించబడిన సెమాగ్లుటైడ్ అనే ప్రొడక్ట్ సుమారు 450 గ్రాముల ఉంటుందని, దీని మార్కెట్ విలువ రెండు కోట్ల వరకు ఉంటుందన్నారు. కేసు విచారణలో స్పెషల్ టీం నియమించి గత మూడు నెలలు కేసు సమగ్ర దర్యాప్తుతో చేపట్టగా ఎనిమిది మంది నిందితులు దొంగతనంలో భాగస్వాములు అయినట్టు గుర్తించమన్నారు. ఇందులో నలుగురు ముద్దాయిలు అదే కంపెనీలో పనిచేస్తున్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. కంపెనీలో సిటిఓ 6, ఎఫ్.జి వేర్ హౌస్ వద్ద ఏ1 సురేష్, ఏ 2 రాఘవేంద్ర, ఏ3 అప్పల నాయుడు, ఏ4 కాంతారావు అనే నలుగురు ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. ఇందులో ముందుగా రాఘవేంద్ర అనే వ్యక్తి ఆ ప్రోడక్ట్ ని దొంగతనం చేసి అప్పలనాయుడుకు ఇచ్చారన్నారు. అప్పలనాయుడు సురేష్‌నకు ఈ ప్రోడక్ట్ ఇచ్చి డిస్పోజల్ చేయమని తెలియజేశారన్నారు. సురేష్ విశాఖపట్నం దువ్వాడలో ఉన్న డాక్టర్ రెడ్డిస్ లేబరేటరీస్ లో పనిచేస్తున్న కాంతారావుకి ఇవ్వగా, అతను హైదరాబాదులో గల ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న తిరుపతి అనే వ్యక్తికి సదరు ప్రొడక్ట్ అందజేసి అమ్మాలన్నారు. తిరుపతి అనే వ్యక్తి ఆ ప్రోడక్ట్‌ను నిర్ణీత సమయంలో అమ్మకపోవడంతో మరో వ్యక్తి జి సురేష్ రెడ్డికి ఇచ్చాడన్నారు. సురేష్ రెడ్డి ఇంతకుముందు అరబిందో కంపెనీలో పనిచేస్తున్న సమయంలో పెల్లాడియం అసిటెట్ అనే ప్రొడక్ట్ దొంగతనం కేసులు ముద్దాయిగా ఉన్నారన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. మొత్తానికి ఈ ప్రోడక్ట్ నీ సురేష్ రెడ్డి ద్వారా అమ్మడానికి అందరు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.సురేష్ రెడ్డి కూడా ప్రోడక్ట్‌ని నిర్ణీత సమయంలో అమ్మ లేకపోవడంతో ఏ7 బాలకృష్ణ, ఏ8 నవీన్ కుమార్‌ను హైదరాబాద్ పంపించి ప్రోడక్ట్ తీసుకుని రమ్మని తెలుపగా ఈ క్రమంలో సురేష్ రెడ్డి ఒరిజినల్ ప్రొడక్ట్‌ను ఉంచుకొని డూప్లికేట్ ప్రొడక్ట్‌ను వాళ్ళకి ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఒరిజినల్ ప్రోడక్ట్ తో పాటు డూప్లికేట్ ప్రోడక్ట్ ను అమ్ముతున్న క్రమంలో ఈ ఎనిమిది మందిని అరెస్టు చేశామని తెలిపారు. వీరు గతంలో కూడా సుమారు ఎనిమిది నెలల క్రితం అదే కంపెనీలో పెల్లాడియం అసిటెట్ కెమికల్ ప్రోడక్ట్ సుమారు 3.38 కేజీలు దొంగతనం చేశారన్నారు. వీటి విలువ 60 లక్షలు ఉంటుందన్నారు. ఇది పూర్తిగా అతి విలువైన రా మెటీరియల్ అని, ఈ మెటీరియల్‌ను రికవరీ చేయవలసి ఉందన్నారు. త్వరలో రికవరీ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో 8 మందిని అరెస్టు చేసి, రెండు కోట్ల విలువైన 450 గ్రాముల సెమాగ్లుటైడ్ పూర్తిగా రికవరీ చేయడం జరిగిందన్నారు. పరిశ్రమలు పరిసరాలతోపాటు అంతర్గతంగా సీసీ కెమెరాలను యాజమాన్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి ద్వారా నేర నియంత్రణకు అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. పై కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి, ముద్దాయిలు అరెస్టు, కేసు ప్రాపర్టీ పూర్తిస్థాయిలో రికవరీ చేయడంలో శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందపర్యవేక్షణలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్సై చిరంజీవి, లక్ష్మణరావు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ ఎం.అవతారం, ఎస్సైలు చిరంజీవి, లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## నేటి నుంచి ఆధార్ అప్డేషన్‌కు ప్రత్యేక క్యాంపులు



**పలాస, జూన్ 11(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బయోమెట్రిక్ పెండింగ్ ఉన్న వారి కోసం ప్రభుత్వం వారి ఆదేశానుసారం నేటి నుంచి ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లో ఈ సెంటర్లను ఈనెల 27వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న పురుషోత్తపురం -2, చిన్నబాడాం, 13న పురుషోత్తపురం -1, పెంట వీధి, 24న శ్రీనివాస నగర్, పద్మనాభపురం, 25న హరిజన వీధి, పద్మనాభపురం కాలనీ, 26న న్యూ కాలనీ, బత్తుల వీధి, 27న మొగిలిపాడు, తాళ్ళభద్ర సచివాలయాల్లో బయోమెట్రిక్ అప్డేట్ కాని వారు, ఆధార్ అప్డేట్ కాని వారు, పెండింగ్ ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

# పండ్ల తోటల పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**- చిన్న రైతులకు పండ్లతోటల పెంపకంపై ప్రత్యేక ప్రోత్సాహం**

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం,జూన్ 11(వార్త):** జిల్లాలోని ఎస్సి, ఎస్టిలు, బీసీలు, ఇతర వర్గాల చిన్న, సన్నకారు రైతులు (ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన వారు) పండ్లతోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ డిపిసి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్షాధారిత పండ్లతోటల పెంపకం పథకం కింద జిల్లాలో 22 రకాల మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ పథకం కింద మామిడి, జీడి, నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, జామున్, చింత, సీతాఫల, దానిమ్మ, అత్తి, బేరు, బటర్ ఫ్రూట్, జాక్ ఫ్రూట్, డ్రాగన్ ఫ్రూట్, మునగ, స్వీట్ ఆరెంజ్, ఆయిల్ పామ్, కోకో, పూల తోటలుగా రోస్, జాస్మిన్ వంటి పంటలకు గోతుల త్రవ్వకం, మొక్కల కొనుగోలు, నీరు పోయడం సహా నిర్వహణ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. పంట రకాన్ని బట్టి ప్రతి ఎకరానికి రెండేళ్ల నుంచి మూడేళ్లలో రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు ఖర్చును భరించనున్నట్లు వివరించారు. గతేడాది (2024-25)లో జిల్లాలో 1,650 ఎకరాల్లో వర్షాధారిత ఉద్యాన పంటల పెంపకం చేపట్టగా, ఈ ఏడాది లక్ష్యాన్ని 3,000 ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. జాబ్ కార్డు కలిగిన అర్హులైన రైతులు సంబంధిత మండల కార్యాలయాల్లోని ఎంపీడీఓ, ఎపీఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్



ఆధ్వర్యంలో కూడా వివరాలు పొందుపరచి పత్రాలు సమర్పించవచ్చునని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, స్థిర ఆదాయ మార్గాన్ని ఏర్పరుచుకోవాలని కోరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.



## సరుబుజ్జిలి కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి

**సరుబుజ్జిలి, జూన్ 11(వార్త):** సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా పైడి పద్మావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా చేరిన వై.శ్రీనివాసరావు శాఖాపరమైన బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా గుర్ల కళాశాలకు బదిలీ కాగా, పద్మావతి సరుబుజ్జిలి వచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ ఫలితాలు అందించేందుకు కృషి చేస్తానని పద్మావతి తెలి పారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామని, సైన్స్ ఆర్ట్స్ గ్రూపులతో పాటు ఏఅండ్‌టీ వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సరుబుజ్జిలి, బూర్జ, ఎల్.ఎన్.పేట మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. నూతన ప్రిన్సిపాల్‌ను అభినందించిన వారిలో సర్వ శిక్ష అభయాన్ ఏపీసి శశిభూషణ్, అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆకెళ్ళ రామారావు, రమేష్ సాహు, వినోద్ రాజు, గొండు శ్రీనివాసరావు, విజయ్, స్టేట్ మీడియా కన్వీనర్ దుగ్గివలస రాంప్రసాద్, డీఆర్ సంఘం ప్రతినిధి సోపేటి రమేష్, ప్రిన్సిపాల్స్ మరపట్ల పవన్, గణపతి ధనంజయరావు, జి.తిరుపతిరావు, యూడీసీ రమేష్ తదితరులు ఉన్నారు.

## నేడు పాఠశాలల పునః ప్రారంభం

**సరుబుజ్జిలి, జూన్ 11(వార్త):** వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయని ఎంఈవో కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలకు ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ సరఫరా అయ్యాయని, మండలాల స్థాయి పాయింట్లలలో ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

# అధికారుల గైర్హాజరుపై సభ్యుల ధ్వజం

**-వాడీవేడిగా మందస మండల సమావేశం**

**మందస, జూన్ 11(వార్త):** అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కానప్పుడు మండల సర్వసభ్య సమావేశాలెందుకని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలను కూడా అధికారులు బాధ్యతగా చూడడం లేదని ఆరోపించారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ మాట్లాడుతూ వివిధ శాఖల మండల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావడంలేదని, మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో భాగంగా వైస్ ఎంపీపీ సిర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ అధికారులు ఒక్కసారి కూడా మండల పరిషత్ సమావేశాలకు హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మందస-హరిపురం రోడ్డు గోతులమయమై దారుణంగా ఉందని, ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదని, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలన్నారు. వచ్చే సమావేశాల నుంచి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోతే మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలను బహిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో వై.వెంకటరమణ మాట్లాడుతూ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలు సమస్యలను చర్చించే వేదికలని, అధికారులు తప్పనిసరిగా పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలన్నారు. తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ మాట్లాడుతూ మందస మండలంలో వాటర్ టాక్స్‌లు సుమారు రూ.25 లక్షల వరకు బకాయిలున్నాయని, కేవలం రూ.లక్ష మాత్రమే వసూలు కాబడిందన్నారు. ప్రజా ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించి వాటర్ ట్యాక్స్ చెల్లించేలా సహకరించాలని కోరారు. కౌలు రైతుల కార్డులు నత్తనడకన సాగుతున్నాయని, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్నాన ఆదినారాయణ, ఏవో బూరగాన ఋషేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.




## వైభవంగా జగన్నాథస్వామి చందనోత్సవం



**ఇచ్ఛాపురం, జూన్ 11(వార్త):** ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం జగన్నాథస్వామి చందనోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక పెద్ద జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్ఠ మండపంపై బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి మూర్తులకు పంచామృతాభిషేకాలు బుధవారం నిర్వహించారు. అనంతరం చందనం లేపనం పూశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 15 రోజుల పాటు నిజరూప దర్శనం నిలిపివేస్తారు.

# రక్తదానంపై నారాయణ నర్సింగ్ కళాశాలలో అవగాహన




**శ్రీకాకుళం,జూన్ 11(వార్త):** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం పట్టణంలోని నారాయణ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో బుధవారం రక్తదానం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ జిల్లాలో తలసీమియా, సికిల్ సెల్, దయాలసిస్ తదితర రోగాలు పెరుగుతున్న నేపథ్యంలో రక్తావసరం రోజు రోజుకీ ఎక్కువవుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి. అన్ని విభాగాలు కలిసికట్టుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. అవసర సమయంలో సేవలందించడంలో పారామెడికల్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు కె. సత్యనారాయణ, పి. చైతన్య కుమార్, ఎన్.ఉమాశంకర్ పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. "జిల్లాలో రక్తానికి డిమాండ్ పెరుగుతున్నది. అందుకే యువత చైతన్య కార్యక్రమాలతో పాటు రక్తదానంలో భాగస్వామ్యం కావాలి" అని వారు పిలుపునిచ్చారు. ఈ నెల 14వరకు జిల్లా వ్యాప్తంగా మండల, గ్రామస్థాయిల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది, ఇతర సిబ్బంది, విద్యార్థులు భాగస్వామ్యం అయ్యారు.

## మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత

**మందస, జూన్ 11(వార్త):** ప్రకృతిని కాపాడటానికి ప్రతీఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ సేనాపతి దివ్యమురళి కోరారు. కొత్తపల్లి గ్రామంలోని సచివాలయం, శ్మశానవాటిక పరిధిలో మర్రి, బాదం, కాము తదితర మొక్కలను కొత్తపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాటి, వాటి పరిరక్షణ కోసం తగు ఏర్పాట్లు చేశారు. భవిష్యత్‌లో గ్రామం చుట్టుపక్కలా మరిన్ని మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సేనాపతి మురళి, కొత్తపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు యస్.గణేశ్వరరావు, గవ్వ భీమారావు, స్థానిక పెద్దలు యం.హరిబంధు, టి.జగన్నాయకులు, యువకులు టి.గోపి, యస్.హరీష్, యం.హేమరాజు, వినయ్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



# యోగా జీవితంలో భాగం కావాలి

**శ్రీకాకుళం, జూన్ 11(వార్త):** యోగా జీవితంలో ఒక భాగం కావాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నదొరై వెల్లడించారు. 80 అడుగుల రహదారిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలు వేయడం వలన క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతీ రోజు యోగాసనాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, ఆయుష్ శాఖ నుండి చంద్రశేఖర్, యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సీతయ్య ఫౌండేషన్‌కు వితరణ

**ఇచ్ఛాపురం, జూన్ 11(వార్త):** కంచిలి సీతయ్య ఫౌండేషన్‌కు స్థానిక ఏలియన్స్ క్లబ్ సభ్యులు సహాయం అందించారు. రూ.10 వేలు, రూ.10 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో లోపింటి నరసింహ మూర్తి, బత్తుల వెంకట రమణ, ఉమా శంకర్, బుజ్జి, సత్యమయ్య, తెలుకల రామారావు, యోగి, నరసింహ మూర్తి, లోహిదాస్ రెడ్డి,శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.





## రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

**-ప్రతి ఇంటికీ తాగునీరు**

**- ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం**

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**జలుమూరు, జూన్ 11(వార్త):** జలుమూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రూ.15కోట్లతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండలాన్ని అభివృద్ధిలో అగ్రస్థానం నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. పంచాయతీల పరిధిలో మంజూరైన పనుల పత్రాలను సభ్యులకు అందజేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## నేడు మందసలో ప్రభుత్వ విజయోత్సవం

**మందస, జూన్ 11(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం విజయోత్సవ పండగను మందసలో ఈ నెల 12న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కటింగ్ చేసి, మిఠాయిలు పంచుకొని పండగలా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కుటుంబ సభ్యులంతా గురువారం ఉదయం 10 గంటలకు మందస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రోడ్లు ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**పోలాకి, జూన్ 11(వార్త):** పల్లె పండుగలో భాగంగా పూర్తయిన జడురు – గతలవలస టూ కమ్మరిపేట సీసీ రోడ్డు, జడురు –గతలవలస టూ చింతువానిపేట గ్రామం వరకు బీటీ రోడ్లను ఎమ్మెల్యే రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ప్రారంభించారు. ఇటీవలే రూ.2కోట్లతో నిర్మించిన గొల్లలవలస–సంతలక్ష్మీపురం రోడ్డును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లావణ్య, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, ఎంపీటీసీ యాగటి లక్ష్మణ్, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

**ఇచ్ఛాపురం, జూన్ 11(వార్త):** లొద్దపుట్టి సీనియర్ వైస్సార్సీపీ నాయకులు సుగ్గు ఛత్రపతి రెడ్డి తమ్ముడు సుగ్గు హరిపతి ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు హరిపతి కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ బోర పుష్ప, ఆసి దాలయ్య రెడ్డి, పిట్ట ఆనంద్, దుక్క ఆనంద్, వాసు, తేజ తదితరులు ఉన్నారు.








## ప్రజా ప్రతినిధులుగా గుర్తించని సమావేశాలేల?

**- మండల సమావేశం నుంచి ఎంపీపీ తో సహా సభ్యుల వాకౌట్.**

**-అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ధ్వజం**



**సంతబొమ్మాళి, జూన్ 11(వార్త):** సంతబొమ్మాళిలో బుధవారం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ప్రారంభం కాగా ఎంపీపీతో సహా జడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్ లు సమావేశంను బహిస్కరిస్తూ బయటకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నుంచి మండలం లో, గ్రామ పంచాయతీ లలో ఏ ఒక్క పని చేయనీయకుండా, ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టనియకుండా ఇక్కడ అధికారులు అడ్డుపడుతున్నారని పలువురు సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. ఇలా చేయమని ప్రభుత్వం నుంచి మీకు ఏమైనా ఆదేశాలు వచ్చాయా అంటూ ఎంపీడీఓ జయంత్ ప్రసాద్‌ను సమావేశం ప్రశ్నించారు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రజా ప్రతినిధులు గా మీరు మాకు గౌరవం ఇవ్వనపడు ఇలాంటి సమావేశాలు మా ఆధ్వర్యంలో జరపడం ఎందుకు అని ఎంపీడీఓ ను నిలదీశారు.

ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు ఎంపీడీఓ తో ఈ సమావేశం లో అడిగి ప్రశ్నలకు మీ సమాధానం బట్టి సమావేశం నిర్వహించాల నిలిపి వేయాలని నిర్ణయించుకుంటామన్నారు. మండల గ్రాంట్, పంచాయతీ గ్రాంట్ సర్పంచ్ లు ఎంపీటీసీ లతో ఎందుకు ఖర్చు పెట్టనియడం లేదు అని అన్నారు. అలాగే గత 18నెలలు గా ఎంపీటీసీ గౌరవ వేతనం నిధులు ఎందుకు ఇవ్వలేదు సమాధానం చెప్పాలని ు పట్టు బట్టారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఎంపీటీసీ ల గౌరవ వేతనం ఈ ఏడాది కి నిధులు వచ్చాయని వాటిని త్వరలో అందజేస్తామన్నారు. గత 18నెలలు ఎంపీటీసీ ల వేతనం నిధులు రూ 9.90లక్షలు లాప్స్ అయిపోయాయి. దీనిపై సీఈఓ కు లెటర్ కూడా పెట్టన్నారు. గ్రామ పంచాయతీ పనులకు సంబంధించి పంచాయతీ రాజు అధికారులు ఎస్టిమేట్లు వేయాలి ఎంపీడీఓ అనడంతో అయితే సమావేశాలో పంచాయతీ రాజ్ అధికారులు హాజరు కాలేదు.

అలాగే ఎంపీడీఓ ఇచ్చిన సమాధానం కూడా సరిపోలేదని, అభివృద్ధి పనులకు కూడా సంబందిత అధికారులు అంచనాలు కూడా తయారు చేయకుండా అభివృద్ధి కి అడ్డు పడుతున్నారని అలాంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకు దండగ అని ప్రశ్నిస్తూ. ఎంపీపీ, జడ్పీటీసీ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఎంపీపీ లేని సర్వ సభ్య సమావేశం నిర్వహించడం సాధ్యం కాదని కొంత సమయం తరువాత ఎంపీడీఓ చెప్పడంతో అధికారులు కూడా వెళ్లిపోయారు. అంతకు ముందు ఉదయం పది గంటలకు జరగవలసిన ఈ సమావేశం కనీసం కోరం సభ్యులు లేకపోవడం తో దాదాపు రెండు గంటల ఆలస్యం గా ప్రారంభం అయింది. అయితే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు ఒక్కరు ఇద్దరు తప్ప మిగిలిన శాఖల నుంచి కింద స్థాయి సిబ్బంది హాజరు కావడం విశేషం.ఈ సమావేశం లో జడ్పీటీసీ పాల వసంత రెడ్డి, వైస్ ఎంపీపీ పొందల తులసమ్మ , ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు,తహసీల్దార్ హేమసుందర్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు నాణ్యమైన ఆహారమందించడమే లక్ష్యం




**- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**

**- నేటి నుంచే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో సన్న బియ్యంతో భోజనం**

**శ్రీకాకుళం, జూన్ 11(వార్త):** ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న పిల్లలకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సరఫరా అవుతోన్న సాధారణ బియ్యం స్థానంలో త్వరగా ఉడికే, నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గురువారం నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం 2,599 పాఠశాలలు, 153 హాస్టళ్లకు కలిపి 655 టన్నుల సన్న బియ్యం ఇప్పటికే సరఫరా పూర్తైందన్నారు. బియ్యం సరఫరాలో పారదర్శకత కోసం "ట్రేసబిలిటీ" విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా ఏ మిల్లులో బియ్యం ఆడించారు, ఏ పాఠశాలకీ, హాస్టల్‌కీ పంపారో అన్న వివరాలన్నీ క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ చర్యలతో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు కట్టుబడిందని ఖాన్ పేర్కొన్నారు.

## విద్యార్థులు, యువతకు బాసటగా వైసీపీ

**- 13న కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన**

**- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్**



**శ్రీకాకుళం, జూన్ 11(వార్త):** పట్టభద్రుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, వచ్చే జూన్ 13వ తేదీ (శుక్రవారం) జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్ని విభాగాల నాయకులకు పిలుపునిచ్చారు. సంవత్సరం నిండిపోయినా ఫీజు రీయింబర్సుమెంట్ ఇవ్వకుండా విద్యార్థులను గందరగోళంలోకి నెట్టేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలేమీ లేకుండా నిరుద్యోగ భృతి కూడా నిలిపేశారు. ఈ విధంగా విద్యార్థులు, యువతను కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసింది," అని ఆయన ఆరోపించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, విద్యార్థి, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ యువజన, విద్యార్థి విభాగాల సమన్వయంతో కార్యాచరణ చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



## భర్త ఇంటి ముందు.. న్యాయపోరాటం



**శ్రీకాకుళం క్రైం, జూన్ 11 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని బలగమెట్టుకి చెందిన వ్యక్తితో 2012లో మంజుశ్రీకి వివాహం జరిగింది. అదనపు కట్నం కోసం రోజూ భర్త వేధించడమే గాకుండా విడాకులు తీసుకోకుండా మరో వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై మంజుశ్రీ శ్రీకాకుళం పోలీసులకు గతంలో ఫిర్యాదు కూడా చేసింది. మంజుశ్రీ కుమారుడితో కలిసి భర్త ఇంటిముందు మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు నిరసన కార్యక్రమం చేపట్టింది. తనకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసింది. శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించారు.

* నేడు పాఠశాలలు పున: ప్రారంభం
* బడికి సిద్ధమవుతున్న విద్యార్థులు
* పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు మిత్ర కిట్ల పంపిణీ
* తల్లికి వందనం పథకం అమలుకు శ్రీకారం

# మోగనున్న.. బడి గంటలు



**శ్రీకాకుళం, జూన్ 11(వార్త):** ఏపీలో పాఠశాలలకు బుధవారం నాటితో వేసవి సెలవులు ముగియనున్నాయి. గురువారం నుంచి 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభంకానుంది. మరోవైపు వేసవి ఎండలు తగ్గి చిటపట చినుకులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో ఎప్పటిలాగానే బడి గంటలు ఉదయాన్నే మోగనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు దాదాపు 50 రోజులపాటు సెలవులు ఎంజాయ్ చేసిన పిల్లలు బడికి బయల్దేరే సమయం ఆసన్నమైంది. దీంతో సెలవుల్లో హాయిగా, ఆనందంగా గడిపిన చిన్నారులు భుజాన బ్యాగులు వేసుకుని బడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, టిఫిన్ బాక్సులు, పెన్సిల్‌లు కొనేందుకు బిజీగా మారారు. మరోవైపు సర్కార్ బడులు విద్యార్థులను ఘనంగా ఆహ్వానించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. జూన్ 12వ తేదీన బడులు తెరచిన మొదటి రోజే విద్యార్థికి మిత్ర కిట్లను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. అలాగే తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బులు కూడా గురువారమే జమ చేయనుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రకటనలు కూడా జారీ చేసింది. ఈక్రమంలో తరగతి గదులను ప్రత్యేకంగా డెకరేషన్ చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక తెలంగాణలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పలు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ స్కూళ్లు తరగతులు ప్రారంభించగా.. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు అధికారికంగా ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల పని వేళలు ఉండనున్నాయి.

### నేడు తల్లుల ఖాతాలోకి నగదు

తల్లికి వందనం పథకం అమలు కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షలకుపైగా తల్లులకు మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం నేరుగా నిధులు జమ కాబోతున్నాయి. ఇందుకోసం రూ.8745 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేస్తూ జూన్ 12 నాటికి తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయనుంది. 'పిల్లల చదువు తల్లుల బాధ్యతగా మాత్రమే కాక, ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలనే భావనకు ప్రతీకగా ఈ పథకాన్ని ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రకటించింది. 'ఎంత మంది పిల్లలు ఉంటే, అంత మందికీ తల్లులకు నిధులు ఇవ్వడం' అన్నది ఈ పథకం మూలం. ఇప్పుడు అదే ప్రకారం 67,27,164 మంది విద్యార్థుల తల్లులకు నిధులు అందబోతున్నాయి. ఈ పథకం ప్రత్యేకత ఏంటంటే, అది 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లల తల్లులనుండి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లుల వరకూ వర్తిస్తుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తయిన తర్వాత వారి వివరాలు ప్రభుత్వం వద్దకు వచ్చిన వెంటనే ఆయా తల్లుల ఖాతాల్లో డబ్బు నేరుగా జమ అవుతుంది. ప్రతి విద్యార్థి గురించి తల్లికి గుర్తింపు ఉండేలా విధివిధానాలపై జీఓ మంగళవారం విడుదలైంది.

### నేటి నుంచే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో సన్న బియ్యం పంపిణీ

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న పిల్లలకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సరఫరా అవుతోన్న సాధారణ బియ్యం స్థానంలో త్వరగా ఉడికే, నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో గురువారం నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం 2,599 పాఠశాలలు, 153 హాస్టళ్లకు కలిపి 655 టన్నుల సన్న బియ్యం ఇప్పటికే సరఫరా పూర్తైందన్నారు. బియ్యం సరఫరాలో పారదర్శకత కోసం "ట్రేసబిలిటీ" విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా ఏ మిల్లులో బియ్యం ఆడించారు, ఏ పాఠశాలకీ, హాస్టల్‌కీ పంపారో అన్న వివరాలన్నీ క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ చర్యలతో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు కట్టుబడిందని ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు.

---

## పోరాటాలతో సాధించుకున్న హక్కులు కాపాడుకోవాలి

* దేశ సంపదంతా కార్పొరేటర్ల చేతుల్లోనే
* కులమతాలు పేరిట చిచ్చుపెడుతున్న బీజేపీ
* నక్సలిజం అంతం పేరిట దేశంలో నరమేధం
* సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**పాతపట్నం, జూన్ 11(వార్త):** ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. బుధవారం పాతపట్నంలో సీపీఐ జిల్లా 25వ మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సెంటైన్ స్కూల్ కూడలి నుంచి కోర్టు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడారు. నక్సలిజం లేని దేశంగా చేస్తామంటూ ప్రధాని నరేంద్రమోదీ మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా దేశంలో నరమేధం సృష్టిస్తున్నారని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయన్నారు. దీర్ఘకాలిక పోరాటాలతో సాధించుకున్న హక్కులను బీజేపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేస్తుందన్నారు. సంస్కరణల పేరిట దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో కులమతాలు పేరిట ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని విమర్శించారు. ఎండీయూ ఆపరేటర్ల తొలగింపుతో రాష్ట్రంలో 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, నాయకులు చాపర సుందర్ లాల్, అక్కినేని విమల, సనపల నర్సింహరావు, ఎస్.నారాయణస్వామి, లండ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి బకాయిలు చెల్లించండి

* వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన రామ్మోహన్

**శ్రీకాకుళం, జూన్ 11 (వార్త):** ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రాష్ట్ర రైతుల సమస్యల చర్చించేందుకు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మూడు ప్రధాన అంశాల మీద ఇరువురి చర్చ సాగింది. 2014–19 సంవత్సరాల మధ్య ఉపాధి పథకం కింద రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిల సమస్యను త్వరితగతిన పరిష్కరించి నిధులు విడుదల చేయాలని కోరారు. దేశంలోనే అత్యధిక పామాయిల్ ఉత్పత్తి చేసే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కేంద్ర ప్రభుత్వం క్రూడ్ ఎడిబుల్ ఆయిల్‌పై దిగుమతి సుంకం 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించటం వల్ల దేశీయంగా పంట ఉత్పత్తి చేస్తున్న రైతులు మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల నష్టపోతారని, ఆ సుంఖాన్ని పాత రేటు ప్రకారం కొనసాగించాలని కోరారు. అలాగే జాతీయ



వ్యవసాయ కార్పోరేషన్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా సేకరించి పప్పు దినుసులు ముఖ్యంగా రెడ్ గ్రామ్ గడువు ఈనెల జూన్ 15తో ముగియనుందని రైతుల సౌకర్యం దృష్ట్యా సేకరణ గడువు మరింత పెంచాల్సిందిగా కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు కేంద్రమంత్రి తెలిపారు.



## కూర్మలో అగ్ని ప్రమాదం

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, జూన్ 11 (వార్త):** కిట్టాలపాడు పంచాయతీ కూర్మ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు అగ్నికీలలు మరింతగా వ్యాప్తి చెందకుండా అదుపుచేశారు. ఈ ప్రమాదంలో పర్ణశాలతో పాటు అందులోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వివరాలు తెలియరాలేదు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు నోటిఫికేషన్

* జిల్లాలో 75 పోస్టుల భర్తీ * 20వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానం * నెల 24 నుంచి ఇంటర్వ్యూలు

**శ్రీకాకుళం, జూన్ 11 (వార్త):** జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల నియామకానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నాన్–టి.ఎస్.పి పరిధిలోని 16 ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 75 పోస్టులను భర్తీ చేయనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో 21 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఉన్నాయి. అభ్యర్థులు స్థానిక నివాసం కలిగిన వివాహిత మహిళలు అయి ఉండాలి. వయస్సు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేంద్రాలకు అర్హులైన అభ్యర్థులు లేకపోతే, 18 ఏళ్ల వయస్సు నిండిన వారిని కూడా పరిగణించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస విద్యార్హత పదో తరగతి, మినీ కార్యకర్తలు, సహాయకులకు ఏడో తరగతి ఉండాలి. దరఖాస్తులను ఈనెల 20 సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో స్వీకరిస్తారు. ఈనెల 21 నుంచి 23 వరకు దరఖాస్తుల పరిశీలన, 24 నుంచి 26 వరకు డివిజన్ వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపిక ప్రక్రియలో పదో తరగతికి గరిష్ఠంగా 50 మార్కులు, వితంతువులు, అనాధలు, వికలాంగులకు రిజర్వేషన్లు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు కేటాయించారు. ఎంపికలపై తుది నిర్ణయం నియామక కమిటీకే చెందుతుంది. ఎంపికైన వారు 60 ఏళ్ల వయస్సు నిండే వరకూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546